
వారం వారం కథా ప్రభ

# అనుభవాల ఒడిలో....

నందం రామారావు



**రామనాథం పడుకుని ఉన్నాడు. ఆయన లేచి ఇల్లంతా చిన్న పిల్లాడిలా కలియ తిరగాలని ఆశించాడు. మంచంలోంచి లేవాలని ప్రయత్నించి విఫల మయ్యాడు!**

ఆయన నీరసంగా కళ్లు తెరచి ఇంటి కప్పుకేసి చూస్తుండి పోయాడు. ఐనా, ఆయన కళ్లకేమీ కనిపించటం లేదు. వయసు పెరిగి, కంటిచూపు తగ్గి, శరీరం ముడతలు పడి బతకటమే భరించరానిదిగా ఉంది!

ఆ పెంకుటిల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా ఏ విధమైన అలికిడీ లేదు. ఆవేశంలో ఒంటి స్తంభపు మేడ కట్టించి అందులో ఒకే 'మనిషిని' ఉంచినట్టుగా ఉంది.

ఒకప్పుడు ఈ ఇల్లు ఎంతో సందడిగా ఉండేది. ఇద్దరు పిల్లలూ ఇల్లంతా చిందర వందర చేస్తూ, అది కావాలి, ఇది కావాలీ అని మారాం చేస్తూ ఉండేవారు. వారి అల్లరికి విసిగిపోయిన తల్లి పిల్లల్ని బాదేది కూడా!

"ఒక్క క్షణం కూడా ఈ ఇల్లు ప్రశాంతంగా ఉండదు గదా!" అని తను విసుక్కునేవాడు.

ఆ మాటకి భార్య శాంత ఇల్లూ, భూమీ దద్దరిల్లేటట్టు గోల గోల చేసేది.

"అవును! మీకీ ఇల్లు నరకంగానే కనబడుతుంది. నాటకాలంటూ బయలు దేరే మీకు ఇంట్లో జరుగుతున్న గోల భరించరానిదిగా ఉంది. ఎంతో ఓర్పు ఉంది గనుక ఈ సంసారాన్ని నెట్టుకొస్తున్నాను. అదే ఇంకోతయితేనా..."

అంత అశాంతిలోనూ రామనాథం ఆ మాటకు నవ్వుకునేవారు. "పిచ్చిదానా! మరో ఇల్లాలయితే ద ఇలా వాగదే. భర్త ఇంటికి రాగానే అన్ని సపర్యలూ చేస్తుంది. నువ్వనే మాటలకు నేను గనుక సరిపెట్టుకుంటున్నాను...." ఇలా సాగేవి ఆయన ఆలోచనలు.

అప్పట్లో రామనాథం ఈ ఇంటి సందడికీ, అర్థంలేని భార్య సణుగుడికీ దూరంగా ఉండాలని కోరుకుంటూ ఉండేవాడు. మరిప్పుడో? ఏం ప్రయోజనం? తన వయసిప్పుడు డెబ్బై సంవత్సరాలు దాటాయ్. లేవలేడు. లేచి చక్కని డైలాగులు చెప్పలేడు!

రామనాథం సన్నగా మూలిగి, కళ్లు తెరచి ఇల్లంతా చూశాడు. ఉన్న మూడు గదుల్లోనూ భార్య అలికిడి వినిపిస్తుందేమోనని శ్రద్ధగా ఆలకించాడు. ఏ గదిలోనూ ఉన్నట్టు లేదు. రామనాథం కళ్లు మూసుకుని ఒకవైపుకు తిరిగి పడుకున్నాడు.

మనసు గతంవైపు లాగుతోంది. జీవితంలో జరిగిన కొన్ని మధురమైన సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకోవాలనిపిస్తోంది...

ప్రతి మనిషికీ జీవితంలో జరిగే ప్రతి సంఘటనా గుర్తుండదు. కొన్ని మరచిపోదామన్నా మరచి పోలేనివిగా ఉంటాయి. ఇదిగో... ఈ వయసులో... ఏ పనీ లేకుండా ఇలా మంచంలో ఉన్ననాడు పనికొస్తాయ్.

రామనాథం కళ్లు మూసుకుని ఏదో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించసాగాడు. ఇంతలో అలికిడి కాగా ఆయన కళ్లు తెరచి చూడగానే ఎదురుగా శాస్త్రి నిలబడి ఉన్నాడు.

"ఏరా! ఎలా ఉంది నీ ఆరోగ్యం?" అంటూ వచ్చి పక్కమీద కూర్చున్నాడు. శాస్త్రిని చూడగానే రామనాథానికి ఎంతో సత్తువ వచ్చినట్లనిపించింది. లేవడానికి ప్రయత్నించగా శాస్త్రి వారించి -

"ఎందుకు లేవడం. బయటకెళ్లాలా? నేను తీసుకెడతా రా!" అన్నాడు.

శాస్త్రి మాటకి రామనాథం కృతజ్ఞతగా స్నేహితుడి చేతిని మృదువుగా పట్టుకున్నాడు.

శాస్త్రి 'ఏరా!' అని పిలవటంతో తన వయసు తగ్గిపోయి యవ్వనంలో అడుగు పెట్టినట్లుగా ఉంది.

శాస్త్రి రామనాథంతో కలిసి 'నాటకాలు' ఆడేవాడు. ఇద్దరూ కలిసి ఉంటేనే నాటకం ఒప్పుకునేవారు. ప్రదర్శనలిచ్చిన ప్రతిచోటా పేరు తెచ్చుకున్నారు. శాస్త్రి అనేక సందర్భాల్లో అనేక విధాలుగా, ఆర్థికంగా కూడా రామనాధాన్ని ఆదుకునేవాడు. వారి స్నేహం విడదీయరానిది.

రామనాథం ఆశయాలను, నటుడిగా ఆయన సాధించాలనుకున్న కీర్తిని, అందుకు ఆయన చేసే కృషిని, జీవితం మీద ఆయన ఏర్పరచుకున్న అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, స్వయంగా చూసిన శాస్త్రి, రామనాథం లాంటి స్నేహితుడు తనకు లభించినందుకు గర్వపడ్డాడు.


సాధారణంగా నటులకు ఏదో ఒక బలహీనత ఉండటం సహజం. తాగుడు, ఆడవాళ్లను ఆకర్షించటం, లౌక్యంగా నాలుగు డబ్బులు వెనకేసుకోవడం... ఇవేవీ అలవడని రామనాథం, రామనాథంగానే ఉండిపోయాడు!

రామనాథం స్నేహితుడికేసి చూసి - "ఏరా శాస్త్రీ! నేను లేచి తిరగ్గలనంటావా? నాకు నాటకంలో డైలాగులు చెప్పాలనిపిస్తోందిరా... గుండెల్లో నొప్పిరా! కళ్లల్లో నీరొచ్చి ఎలా వాచాయో చూడు. నేను చనిపోతానేమోనని భయంగా ఉందిరా!" గాద్గదికంగా అన్నాడు.

"నీకు తప్పకుండా నయమవుతుంది. లేనిపోని ఆలోచనలు పెట్టుకుని మనసు పాడు చేసుకోకు. డాక్టర్ వచ్చాడా? ఏమన్నాడు?"

"డాక్టర్ అనేదేముంటుందిరా. ఒరేయ్ శాస్త్రీ! నా వయసు పడిపోయింది గానీ మనసు పడిపోలేదురా. ఎందుకో నా కనిపిస్తోంది - ఏదో ఒక రోజున ఎవరూ దగ్గరలేని క్షణాన..." రామనాథం మాట్లాడలేక పోయాడు. గొంతు పూడుకు పోయింది. కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

'ఏమిట్రా చిన్నపిల్లాడిలా. వెనక ముందు అందరం పోవలసిన వాళ్లమే. ఏమో ఎవరు చెప్పొచ్చారు. నీ కంటే ముందు నేను పోవచ్చునేమో...'



"శాస్త్రీ! రాత్రులు నిద్ర పట్టడం లేదురా. కళ్లు మూసుకుంటే ఈ లోకాన్నుంచే వెళ్లిపోయినట్లుగా ఉందిరా."


"ఊ. ఏడ్చినట్టే ఉన్నాయ్ వెధవ ఆలోచనలూ నువ్వూనూ... అవునూ! మీ అబ్బాయికి ఉత్తరం రాస్తానన్నావ్. రాశావా?"

"రాశాను. ఇవేళో రేపో రావాలి!"

"అర్థంలేని ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు. మళ్లీ రేపు వచ్చి కలుస్తా.

శాస్త్రి లేచి వెళ్లిపోతుంటే, రామనాథం రెప్పవాల్చకుండా అలాగే చూస్తుండిపోయాడు.

"ఏవండీ! మందు వేసుకోండి" అంటూ భార్య వచ్చింది.




రామనాథం భార్యకేసి చూశాడు.

శాంత అందంగానే ఉంటుంది. కావాలని కోరి శాంతను పెళ్లి చేసుకున్నాడు. ఆమె సాహచర్యంలో తన జీవితం వెన్నెలమయమే అవుతుందనుకున్నాడు. ఇల్లాలిగా ఇంటిని చక్కదిద్దుతూ, తనకు తోడూ నీడగా ఉంటూ, తన జీవిస్తున్న నాటక కళలో అన్నివిధాలా సహకరిస్తే చాలునను కున్నాడు. శాంత ప్రోత్సాహంతో తనో గొప్ప నటుడిగా దేశమంతా కీర్తి గడించాలని ఎన్నో కలలు గన్నాడు. ఆ కలలు కలలుగానే మిగిలిపోయాయి.

"మిమ్మల్నేనండి. మందు వేసుకోండి. ఇవేళ మీ ఒంట్లో ఎలా ఉంది?" శాంత ప్రక్కనే కూర్చుని జుట్టులోకి వేళ్లు పోనిచ్చి ఆప్యాయంగా అడిగింది. ఆ సమయంలో రామనాథం నవ్వాలనుకున్నాడు.

'శాంతా! ఎప్పుడైనా ఇంత ఆప్యాయంగా నన్ను పలుకరించావా?' - అని అడగాలనుకున్నాడు.

"సాయంత్రానికి అబ్బాయి రావచ్చు. అమ్మాయి రెండు రోజుల్లో అల్లుడితో వస్తానని ఉత్తరం రాసింది."

రామనాథం భార్య మాటలు విన్నాడు గానీ ఏం మాట్లాడలేదు. ఆయన ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి.

"ఏవండీ! మీరేం మాట్లాడకుండా ఉంటే నాకేవిటో భయంగా ఉందండి"

'శాంతా! ఇప్పుడు నా గురించి నువ్వు తీసుకుంటున్న శ్రద్ధ ఆ రోజుల్లో తీసుకునుంటే నేనెంతో గొప్పవాడి నయ్యేవాడిని శాంతా! ఈ వయసులో ఇలా మంచంలో పడున్నా నాకు ఏ దిగులూ ఉండేది కాదు. అవును శాంతా! ఆ రోజుల్లో నేను ఆశించిందీ, కోరుకున్న ఒక్కటే... నటుడిగా రాణించాలని. నాలో మేరు పర్వతంలా పెరిగిన ఈ కోరికను... శాంతా! నీకు గుర్తుందో లేదో... ఒక రోజేం జరిగిందో తెలుసా?"-

* * *

ఆ రోజు రామనాథం చాలా ఆనందంగా ఇంటికొచ్చాడు. అతని చేతుల్లో వెండి కప్పులున్నాయి. పరిషత్ పోటీల్లో ఉత్తమ నటుడు, ఉత్తమ డైరెక్టర్, ఉత్తమ రచయితగా వాటిని గెల్చుకున్నాడు.

తలుపు బాదగా బాదగా శాంత తీసింది.

అప్పటికి రాత్రి రెండు గంటలు దాటింది.

రామనాథం లోపలికి వస్తూ - "శాంతా! ఇవి నాకు పోటీలో బహుమతి వచ్చాయి. చూడు శాంతా" అన్నాడు సంతోషంగా.

శాంత వాటిని నిర్లక్ష్యంగా తీసుకుని విసురుగా ఒక మూలకు విసిరేసి - "మీకు పెళ్లాం పిల్లలు అక్కర్లేదన్నమాట. నాటకలంటూ వెళ్లి నాల్రోజులు మీ ఇష్టమొచ్చినట్టు తిరిగి అర్ధరాత్రి ఇంటికొచ్చారు. అసలు నన్నెందుకు పెళ్లి చేసుకున్నారు?"

రామనాథం ఏం మాటాడకుండా భార్యకేసి చూసి, దూరంగా పడున్న వెండి కప్పులను తీసుకుని లోపల కెళ్లబోయాడు.

"మిమ్మల్నే. ఇక నుంచి నాటకాలంటూ ఇంటి పట్టున ఉండకుండా తిరిగితే నేను సహించను."

రామనాథం, భార్య దగ్గర కొచ్చి భుజం మీద చేయి వేసి ఏదో చెప్పబోయాడు.

"ఛీ! ఎవత్తో నాటకాల దానితో నాటకాలాడొచ్చి నా దగ్గర నాటకాల డైలాగులు చెబుదామనుకుంటున్నారా?" అంటూ దూరంగా జరిగింది.

భార్య తీరుకు రామనాథంకు అమితమైన కోపం వచ్చింది. ఐనా, ఆమెను ఏమీ అనకుండా లోపలికెళ్లాడు. భార్య భోజనానికి పిలుస్తుందేమోనని చూశాడు. ఆకలితో ప్రేవులు మాడిపోతున్నాయి. సహనటులు 'అందరం కలసి భోజనం చేద్దామని' ఎంత బ్రతిమిలాడినా వినిపించుకోకుండా వచ్చేశాడు. భార్యకు తన కొచ్చిన బహుమతులను ముందుగా చూపించాలని, భార్య కొసరి కొసరి వడ్డిస్తుంటే భోజనం చేస్తూ పరిషత్‌లో జరిగిన విశేషాలన్నీ చెప్పాలని ఆశించి వచ్చాడు. కానీ, ఇక్కడ తన ఊహలకు భిన్నంగా ఉంది!

రామనాథం భార్య దగ్గర కొచ్చి - "శాంతా! నాకు ఆకలిగా ఉంది. అన్నం వడ్డించు" అన్నాడు.

"వండి ఉంచడానికి మీరెప్పుడొచ్చేది నాకు చెప్పి వెళ్లారా?"

రామనాథానికి ఆ మాట చెంపమీద కొట్టినట్లనిపించింది!

ఇది నిర్లక్ష్యమా? అహంభావమా? అమాయకత్వమా?

'శాంతా! ఇలాగేనా మాట్లాడేది? నేనింటికి రాగానే నాకు జరిగిన సన్మానం గురించి నీకు చెప్పి, బహుమతులను చూపించాలని, వాటిని నువ్వు చూసి ఎంతో సంతోషించాలని ఆశించాను.'

"ఆ. సంతోషించినట్టే ఉంది. ఈ నాటకాలూ, ఈ సన్మానాలు, ఈ కప్పులూ మనల్ని ఉద్ధరిస్తాయిగా మరి."

భార్య మాట తీరుకు రామనాథం నవ్వి -

"పిచ్చిదానా! 'కళ' జీవితాన్ని పునీతం చేస్తుందే. అందులో ఉన్న తృప్తి మరెందులోనూ ఉండదు శాంతా."

"మీరిలా తృప్తి పడుతూనే ఉండండి. మా బ్రతుకులిలాగే తెల్లవారతాయి. ఇదిగో చెబుతున్నా మీరిలా నాటకాలంటూ తిరిగితే నేను నా పుట్టింటికి వెళ్లిపోతాను."

శాంత మాటలకు రామనాథానికి అమితమైన కోపం వచ్చింది. కానీ, ఆమెకు బుద్ధి చెప్పడానికి చేయి చేసుకోలేడు. ఒక పరాయి ఆడపిల్లను నలుగురి ఎదుటా అర్ధాంగిగా స్వీకరించిన తను భార్యకు బాధ కలిగించటం ఇష్టం లేక, తెలిసీ తెలియని ఆమె మాటల తీరు క్షమిస్తూ ఇంతకాలం వచ్చాడు. ఆ క్షమించడాన్ని శాంత చేతకానితనంగా భావించవచ్చును. ఐనా, ఇంక సహించలేడు.

'ఏం బెదరిస్తున్నావా? నిన్ను చేసుకున్న తర్వాతనే గదా నాకీ కష్టాలు. నా ఉత్సాహాన్ని, నా ఆశయాలను అనుక్షణం నాశనం చేస్తూనే ఉన్నావ్.'

"అనండి... అనండి... నాటకాల్లో ఎవత్తెనో వెంటేసుకుని తిరుగుతూ ఇక్కడ కొచ్చి మీ ఇష్టమొచ్చినట్టు తిడుతున్నారు."

"నోర్ముయ్."

రామనాథం చేయి ఎత్తాడు. అంతే, ఆ క్షణంలోనే మంచం మీద పడుకున్న రెండేళ్ల కొడుకు కెవ్వున కేకవేసి ఏడ్వడం మొదలు పెట్టాడు. రామనాథం ఎత్తిన చేయి దించి, ఏడుస్తున్న కొడుకుని సముదాయించసాగాడు.

"నన్ను కొట్టడానికి చెయ్యెత్తేరు కదూ. నేను మీకు ఇష్టం లేనప్పుడు ఈ బతుకెందుకు?" అంటూ నూతి దగ్గరకెళ్లి అందులో దూకబోయింది.

ఆమె స్వభావం ఏవిటో పెళ్లయిన దగ్గర నుంచీ రామనాథానికి తెలుసు గనుక, గబగబా వెళ్లి శాంతను వారించి లోపలికి తీసుకొచ్చాడు. ఆ రాత్రంతా, భార్య ఏ అఘాయిత్యం చేస్తుందోనని కనిపెట్టుకునే ఉన్నాడు రామనాథం!

* * *

"ఏవండీ! ఈ మందులు వేసుకోండి."

భార్య మాటకి రామనాథం ఆలోచనల నుంచి తేరుకుని ఆమెకేసి చూశాడు.

శాంత దిగులుగా ఉంది. కళ్ల చుట్టూ నల్లని గీతలు.

భర్తను తను ఎంత మానసికంగా చిత్రహింసలు పెట్టిందీ తలచుకుని కుమిలిపోతోంది ఇప్పుడు. ఆయన గొప్పతనాన్ని ఆ నాడు గుర్తించలేక పోయింది. తను ఆయన్ని ప్రోత్సహించి ఉంటే ఎంత గొప్పగా ఉండేదో!

రామనాథం మందు తీసుకుని - "శాంతా" అన్నాడు.

ఆమె, భర్త భుజం మీద చేయి వేసి, చేత్తో తల నిమురుతూ ఏవిటన్నట్టు చూసింది.

"అదిగో! ఆ గోడనున్న ఫొటో ఒక్కసారి తీసుకురా."

శాంత ఆ ఫొటో తీసుకొచ్చి భర్తకిచ్చి వంటగదిలో కెళ్లింది.

రామనాథం రెప్పవాల్చకుండా ఆ ఫొటోను దీక్షగా చూడసాగాడు.

ఆ ఫొటో తను నాటకాలాడే రోజుల్లో గ్రూపంతా కలిసి దిగింది - శాస్త్రి తన పక్కన కూర్చుని ఉన్నాడు. తనకు మరో పక్కన కోమలి కూర్చు నుంది. అవును కోమలి!

కోమలి జ్ఞాపకం రాగానే రామనాథం కళ్లల్లో నీళ్ల నిలిచాయి.

"కోమలీ" అంటూ సన్నగా ఆ మాటల్ని కూడబలుక్కున్నాడు.

కోమలి నాజూగ్గా ఉండేది. మల్లెపువ్వులా, విరిసిన పారిజాతంలా, ఈ సృష్టి సౌందర్యాని కంతటికీ రాణిలా ఉండేది.

ఇప్పుడెలా ఉందో?

ఒక రోజున ఏం జరిగిందనీ!

రిహార్సల్సు గదిలో ఇద్దరే ఉన్నారు. ఆ రోజు శాస్త్రి రాలేదు. మిగతా నటులు వాళ్ల పోర్షన్స్ చూసుకుని వెళ్లిపోయారు.

"కోమలీ! అంతా వెళ్లిపోయారు. మనం కూడా వెళ్లిపోదాం పద!" అన్నాడు.

"అబ్బా ఉండండి. నాటకం వారం రోజులు కూడా లేదు. ఈ నాటకం మనిద్దరి మీదే ఆధారపడి ఉంది. ఓ గంట పోర్షన్ చూసుకుని వెళ్లిపోదాం" కోమలి అంది.

ఆమె మాట కాదనలేక నాటకంలో డైలాగులు చెప్పసాగాడు. "రాధా! నిన్ను ప్రేమించాను. ఈ సమాజంతో మనకు పనిలేదు. మన జీవితాలకు ప్రేమొక్కటే చాలు. మనిద్దరం దంపతులమై ఈ సంఘానికి ఒక కొత్త నిర్వచనాన్నిద్దాం" అంటూ రాధ వేషంలో ఉన్న కోమలి చేతులు పట్టుకున్నాడు. అప్పుడు ఆమె "అవును సారథీ! నువ్వు నా దైవానివి. నా జీవితానికి వెలుగు నువ్వే" అంటూ కౌగిలించు కుంది.

కోమలి స్పర్శ, కౌగిలింత రామనాథంకు వింత అనుభూతిని కలిగించింది. ఆమెను విడిపించు కోవాలని ప్రయత్నం చేశాడు. కోమలి, అతన్ని అలాగే ఇంకా గట్టిగా కౌగిలించుకుంది.

రామనాథం ఎలాగో అయిపోతున్నాడు.

ఈ కౌగిలింత మధురంగా, భయంగా, కంగారుగా ఉంది!

"కోమలీ! ఏమిటది?" అన్నాడు ఆమెను విడిపించుకుంటూ.

కోమలి అతని కౌగిలి వదల్లేదు. ఇంకా పెనవేసుకుని -

"నన్ను కాదనకండి. మీ కోసం పడి ఛస్తున్నాను. ఇటువంటి అవకాశం మళ్లీ మనకు రాదు. మీ వ్యక్తిత్వం నన్ను ఆకర్షించింది. ప్లీజ్. నన్ను కాదనకండి" అంటూ కోమలి రామనాథాన్ని గట్టిగా ముద్దు పెట్టుకుంది.

ఇది వింత అనుభూతి!

శరీరం గగుర్పాటు!

సృష్టిలో ప్రతి ప్రాణీ అనుభవించే

మత్తైన కోరిక!

ఈ కోరికను కాదనలేడు!

కాదని మామూలు మనిషి కాలేడు!

కోమలి సౌందర్యం, కురుల నుంచి వచ్చే పరిమళం, శరీరపు వాంఛ, ఆమె ముఖంలో వెలిగే భావం....

"కోమలీ!" అంటూ ఆమెను గట్టిగా అదిమి తన కౌగిలిలో బిగించి ముద్దు పెట్టుకున్నాడు.

ఇద్దరూ ఏకమై...

కాలం స్తంభించి నట్లైయింది!

రామనాథం చేతిలోంచి ఫొటో జారి కింద పడిపోయింది.

ఆయన మళ్లీ వాస్తవంలోకి వచ్చాడు.

శరీరమంతా చెమట్లు పోశాయి. రక్తమంతా సలసలా కాగి కొత్త శక్తి వచ్చినట్టుగా ఉంది.

అనుకోని విధంగా నలభై ఏళ్ల క్రితం కోమలితో జరిగిన రహస్యమైన కలయిక ఇంత కాలం తన గుండెల్లోనే ఉండిపోయింది. ఆ తర్వాతెప్పుడూ కోమలితో అనుబంధాన్ని పెంచుకోలేదు. అనుకోని విధంగా జరిగిన ఆ ఒక్క సంఘటనే తన జీవితంలో తీపి గుర్తుగా మిగిలింది!

ఇప్పుడు, డెబ్బై సంవత్సరాలు దాటిన ఈ వయసులో మంచంలోంచి లేవలేని స్థితిలో, కాలం గడవటం దుర్భరమవుతున్న ఈ సమయంలో కోమలి జ్ఞాపకాలు...

రామనాథానికి ఈ జ్ఞాపకాలు ఆనందంగా ఉన్నాయి. బహుశా, చివరి దశలో ప్రతి మనిషికీ ఇటువంటి జ్ఞావకాలు గుర్తుకు రావడం సహజమేమో!

అప్పటికి టైమ్ పన్నెండు గంటలు దాటింది.

రామనాథం నీరసంగా నిట్టూర్చాడు. కిటికీ లోంచి బయటకు చూశాడు.

ఎండ తీవ్రంగా ఉంది. జనసంచారం ఎక్కువగా లేదు.

రామనాథం ఇటువేపు తిరిగి కళ్లు మూసుకున్నాడు.

ఇంతలో ఇంటి ముందు రిక్షా ఆగిన సంగతి ఆయనకు తెలీలేదు. లోపలికి వచ్చిన రామకృష్ణ - "నాన్నా! నీకెలా ఉంది?" అంటూ ఆదుర్దాగా తండ్రి ప్రక్కనే కూర్చున్నాడు.


రామనాథం కొడుకు చేతిని పట్టుకుని - "బాబూ" అన్నాడు. ఆయన కంఠం వణికింది. కళ్లల్లో నీళ్ల నిలిచాయి.


"నీకేం ఫర్లేదు నాన్నా. నీకు నయమయ్యేంత వరకూ ఇక్కడే ఉంటాను. పెద్ద డాక్టర్‌ను తీసుకొస్తాను."

కొడుకు ప్రేమకు రామనాథం హృదయం ద్రవించింది. కొడుకు చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకుని -

"బాబూ! నేను... నేనే..." ఆపైన ఆయనకి మాట పెగల్లేదు.

కనుకొలకుల్లోంచి నీళ్లు జారాయి.






"నాన్నా! నువ్వేం అధైర్యపడొద్దు."

అప్పుడే వంటింట్లోంచి వచ్చిన శాంత కొడుకుని చూసి -

"ఎంతసేపయిందిరా వచ్చి... చూడు మీ నాన్న ఎలా దిగాలు పడిపోయారో" అంది.

తల్లీ, కొడుకు రామనాథం కేసి కొన్ని క్షణాలు చూస్తుండి పోయారు.

"రాత్రి ఎప్పుడనగా భోజనం చేశావో వడ్డిస్తాను రా బాబూ" అంటూ శాంత వంటగదికేసి నడిచింది. రామకృష్ణ తల్లితో వంటగదికేసి నడిచాడు.

కొడుకు ప్రయోజకుడై ఉద్యోగం చేసుకుంటు న్నాడు. వాడికి నచ్చిన పిల్లను పెళ్లి చేసుకోవడానికి తను పూర్తి అధికారం ఇచ్చాడు.

కొడుకుని గొప్ప కళాకారుడిగా తీర్చిదిద్దాలని ఆశించాడు. ఆ ఉద్దేశంతోనే తను రిహార్సల్స్‌కు తీసుకెళ్లేవాడు. దారిలో నాటక కళను గురించి ఎన్నో విషయాలు చెప్పేవాడు. రామకృష్ణ చేత వేషాలు కూడా వేయించసాగాడు. తన కలలు ఫలిస్తాయనుకుంటున్న తరుణంలో మనసుకు పెద్ద గాయమే తగిలింది!

ఆ రోజు సాయంత్రం రామకృష్ణను రిహార్సల్స్‌కు తీసుకెడదామని ఇంటికి వచ్చేసరికి మాటలు వినిపించాయి. శాంత కొడుకుని దగ్గర కూర్చోబెట్టుకుని బోధిస్తోంది -

"చూడు బాబూ! ఆఖరికి నువ్వు కూడా ఇలా మీ నాన్నతో నాటకాలంటూ తిరిగితే ఎలా? నాలకాలాడే వారంటే అందరికీ చాలా చులకన. కళాసేవ, నాటకాలంటూ దేశాలంట తిరుగుతూ మీ నాన్న ఇంటి పట్టునుండేవారు కాదు. ఇక్కడ నేను, మీరూ ఎలా ఉన్నారనే విషయమే ఆయనకు పట్టేది కాదు. నువ్వు కూడా మీ నాన్నలా తయారు కాకు..."

రామకృష్ణ తల్లి చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు.

అంతే! రామనాథం కొడుకుని రిహార్సల్సుకు తీసుకు వెళ్లాలనే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. అప్పుడే భార్యను నిలదీసి అడగాలనుకున్నాడు.

"శాంతా! నేను నీకేం ద్రోహం చేశాను? వ్యసనాలకు బానిసనై ఈ ఇంటిని నరకంగా మార్చానా? నిన్నెప్పుడైనా హీనంగా చూసి చావ బాదానా? శాంతా! కళారంగంలో ఉన్న తృప్తి డబ్బు సంపాదించడంలో ఉండదు. మనిషికి డబ్బే ప్రధానమనుకుంటే ఈ దేశంలో ఆ డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలున్నాయ్."

ఒకవేళ ఇలా అడిగినా భార్య నుంచి ఎటువంటి సమాధానం వస్తుందో తెలుసు. అందుకు గతంలో జరిగిన కొన్ని సంఘటనలే సాక్ష్యం.

ఆ తర్వాత శాంత కొడుకుని పూర్తిగా మార్చేసింది. తను కేవలం నిమిత్తమాత్రుడిగానే కాలాన్ని నెట్టుకుంటూ వచ్చాడు. జీవితంలో జరిగే మార్పులకు తల వంచక తప్పింది కాదు.

తన నాటకాలను చూసి ఉత్తేజితుడైన ఓ మహానుభావుడు కొడుక్కి గవర్నమెంటు ఉద్యోగం ఇప్పించాడు. ఎందరో కళాకారులు, కళారాధకులు కూతురు పెళ్లికి ఆర్థిక సహాయం అందించారు. జీవితంలో తను బ్రతికున్నంత కాలం వారినెవరినీ మర్చిపోలేడు.

రామనాథం కళ్లు తెరచి చూశాడు.

పూర్తిగా చీకటి పడిపోయింది. వీధి పక్కనున్న దీపపు వెలుతురు కిటికీలోంచి లోపలకు పడుతోంది.

రామనాథం ఓసారి గట్టిగా కళ్లు మూసుకుని తెరిచాడు. కళ్లల్లోంచి నీళ్లు జారాయి. ఆయన కంటికి ఏమీ కనిపించడం లేదు. ఆలోచనల బరువుతో తలంతా మొద్దుబారినట్టుగా ఉంది. శరీరమంతా పుండుగా అరికాళ్లు మంటగా ఉన్నాయి. కాళ్లు వాచాయి.

క్షణాలు గడుస్తున్న కొద్దీ ఏదో భయం ఆయన్ని క్రుంగదీయసాగింది. ఇప్పుడే ఈ క్షణమే విలువైనదిగా, ఇంకెన్నడూ స్మృతి కలగనట్టుగా ఉంది! అంతులేని ఆలోచనలతో ఆయన శరీర మంతా చెమటలు పోశాయి. గుండె దడగా, నరాలు వేగంగా కొట్టుకోసాగాయి. కదలడానికి శక్తి కూడా లేకుండా పోయింది. కన్నుల నుంచి నీరు ధారాపాతంగా కారసాగింది.

సరిగ్గా అప్పుడే కరెంటు పోయింది.

బయట చీకటి,

గదిలో చీకటి,

గుండెల్లో చీకటి,

అంతా చీకటి!

ఆ చీకటిలో - ఇంటి నడి కప్పు మీద ఎవరో గబగబా నడిచిపోతున్నట్టుగా, చితికిపోయిన పెంకులు తన గుండెల మీద పడినట్టుగా, ఈ పెంకుటిల్లు కూలి తన మీద పడుతున్నట్టుగా, తన ప్రాణాన్ని ఎవరో బలవంతంగా తీసుకు పోతున్నట్టుగా ఉంది!

రామనాథం అశాంతిగా పక్క మీద అటూ ఇటూ కదిలాడు. భయంగా కళ్లు మూసుకున్నాడు. చెమటలు పోసి చలి జ్వరం వచ్చినట్టుగా వణక సాగారు. గట్టిగా తనను 'రక్షించమని' అరవాలను కున్నారు. నోరు పెగల్లేదు.

తనకు చావాలని లేదు. ఈ భూమ్మీదిలాగే కల కాలం ప్రపంచం ఉన్నంత కాలం చిరంజీవిగా ఉండాలనిపిస్తోంది. ఈ మానవ జన్మలోనే అనిర్వచనీయమైన ఆనందం ఉంది. కష్టాలు, సుఖాలు కన్నీళ్లు, ప్రేమ, అనుబంధాలు

వీటి పరిధిలోనే తనకు బ్రతకాలని ఉంది. భగవాన్! నా ప్రాణాన్ని తీసి ఈ లోకాన్నుంచీ నన్ను దూరం చేయకు. నాకు చావాలని లేదు. నేను చనిపోను-అని రామనాథం ఎలుగెత్తి అరవా లనుకున్నాడు. మాటలు పైకి రావడం లేదు.

ఈ గుండె ఆగిపోతుందేమో... తను చని పోతే... "భగవాన్ వద్దు. ఈ ఊహనే తను భరించ లేడు." రామనాథం నిట్టూర్చాడు. ఉన్నట్టుండి వళ్లంతా చెమటలు పోశాయి. గుండెల్ని ఎవరో పిండుతున్నారు. కళ్ల ముందు ఎవరో వికృతంగా నవ్వుతూ మీద మీద కొస్తున్నారు. ఇంటి మీద ఏవో పక్షులు వికృతంగా అరుచుకుంటూ పోతున్నాయి. గుండెలెన్నడూ లేనంతా వేగంగా కొట్టుకుంటున్నాయి.

రామనాథం ఆయాసపడసాగాడు. వెక్కిళ్లు వస్తున్నాయి. కళ్లు వాటంతటవే మూసుకు పోతున్నాయి. శరీరమంతా ఏమిటోగా అయిపో తుంది. చల్లగా... ఐస్ గొట్టాల్లా... కాళ్లు చేతులు ఆడటం లేదు. రక్తం గడ్డ కట్టుకుపోతోంది. దడగా, కంగారుగా, అయోమయంగా తనేమైపోతున్నాడో తనకే తెలియని స్థితిలో - భార్యా, కొడుకూ, శాస్త్రీ కోమలి అందరూ కన్నీళ్లలో కరిగిపోతున్నారు.

"భగవాన్!" అంటూ రామనాథం శక్తినంతా కూడ దీసుకుని హృదయవిదారకంగా కేక వేశాడు.

అంతే!